సాక్షి నల్లగొండ

ఆదివారం । 25 । మే । 2025



విదేశాలకు డ్రై వెజిటబుల్స్
సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మురళీరాజ్ డ్రై వెజిటబుల్స్‌ను విదేశాలకు ఎగుమతి చేస్తూ మంచి లాభాలు గడిస్తున్నారు.
- 8లో



అప్పులు చేసి పరారైన వ్యాపారి
డ్రై ఫ్రూట్స్ వ్యాపారి తన వద్ద పనిచేసే మహిళల నుంచి అప్పులు తీసుకుని వాటిని తీర్చలేక పరారయ్యాడు.
- 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 36°/25°
పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జూన్ 3 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

నల్లగొండ : జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని డీఈఓ భిక్షపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

బాలపురస్కార్‌కు దరఖాస్తులు

నల్లగొండ : ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్ అవార్డులకు 18 సంవత్సరాలలోపు బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 31-7-2025 నాటికి 18 సంవత్సరాలలోపు వయసు కలిగి ధైర్య, శౌర్య, సాహస కార్యక్రమాలు, సోషల్ సర్వీసెస్, ప్రకృతి, క్రీడలు, కళలు, సాహిత్యం, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన బాలబాలికలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ఆమె పేర్కొన్నారు. అర్హులు awardsr. gov.in వెబ్‌సైట్‌లో జులై 31లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 08682 293929 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

టీఆర్‌జీఎస్ శిక్షణ తరగతులు ప్రారంభం

హాలియా : తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం (టీఆర్‌జీఎస్) విద్యా, వైజ్ఞానిక రాజకీయ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను శనివారం ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ధీరావత్ రవినాయక్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఆంగోతు లలిత శనివారం హాలియాలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రవినాయక్ మాట్లాడుతూ గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, తండాలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. టీఆర్‌జీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమావత్ జవహర్‌నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రమావత్ నరేష్ నాయక్, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ మేగావత్ బాస్కర్‌నాయక్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్, ఉపాధ్యక్షుడు నేనావత్ అశోక్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కనగల్‌లో 55 టన్నుల ధాన్యం సేకరణ



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

కనగల్ : జిల్లాలోనే అత్యధికంగా 55వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనగల్ మండలంలోని 25 ఐకేపీ కేంద్రాల ద్వారా కొనుగోలు చేశామని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం కనగల్ మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు లింకేజీ విషయంలో కనగల్ మండల సిబ్బంది పనితీరును ప్రశంసించారు. స్త్రీనిధి రుణాలను వసూలు చేయడంలో వీఓఏలు అశ్రద్ధ వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం సంకుహరి, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



నీటితో కళకళలాడుతున్న మూసీ రిజర్వాయర్

మూసీకి 1,225 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కేతేపల్లి : జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్టు తర్వాత అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టుకు శనివారం 1225 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం 637 అడుగులకు చేరుకుంది. హైదరాబాద్ నగరంతో పాటు, మూసీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరదనీరు మూసీకి వచ్చి చేరుతోంది. రెండు రోజుల క్రితం హైదరాబాద్ నగరంలో కురిసిన కుండపోత వర్షానికి మూసీకి ఇన్‌ఫ్లో పెరిగింది. నెల రోజుల నుంచి కేవలం ఐదారు వందల క్యూసెక్కులుగా వస్తున్న ఇన్‌ఫ్లో శనివారం 1225 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో 645 అడుగుల గరిష్ఠ నీటిమట్టం గల మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం 637 అడుగులకు చేరింది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.58 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతుండటంతో ఆయకట్టుకు వానాకాలం పంటసాగుకు నీటి విడుదలకు ఢోకా ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కోతకు ఓకే అంటేనే.. దిగుమతి!

ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల ఇష్టారాజ్యం

- ఓవక్క అకాల వర్షాలతో కల్లాల్లో తడుస్తున్న ధాన్యం
- మరోపక్క ధాన్యం దిగుమతి చేసుకోకుండా ఇబ్బంది పెడుతున్న మిల్లర్లు
- రోజుల తరబడి మిల్లుల వద్దే లారీలు పడిగాపులు
- అవస్థలు పడుతున్న అన్నదాతలు



శాలిగౌరారం మండలంలోని రామాంజపురం కొనుగోలు కేంద్రం నుంచి మూడు రోజుల కిందట ఓ మిల్లుకు మూడు లారీల ధాన్యాన్ని పంపించారు. ధాన్యం బాగుంది. తాలు కూడా లేదు. కానీ మిల్లర్లు బస్తాకు 2 కిలోలు కట్ చేసుకొని దించుకుంటామన్నారు. దీనిపై ఆ రైతు కొనుగోలు కేంద్రం నిర్వాహకుడిని అడిగితే మిల్లర్‌తో మాట్లాడుకోమని చెప్పి చేతులెత్తేశారు. దీంతో గత్యంతరం లేక మిల్లర్ చెప్పిన విధంగా కోత విధించేందుకు ఒప్పుకోవాల్సి వచ్చింది. ఇదీ జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకున్న రైతుల పరిస్థితి.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : యాసంగి ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. మిల్లులపై అధికారుల పర్యవేక్షణ లోపంతో మిల్లర్లు తమకు తోచిన విధంగా వ్యవహరిస్తున్నారు. మిల్లులకు వెళ్లిన ధాన్యాన్ని దింపుకోకుండా రైతులను ఇబ్బందులపాలు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు, సాయంత్రమైతే మబ్బులు పట్టి వర్షాలు పడుతుండడంతో పంటను కాపాడుకునేందుకు తంటాలు పడాల్సి వస్తోంది. కష్టించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి వేచి ఉంటూ.. ఏదోలా అమ్ముకున్నాక మిల్లర్లు పెడుతున్న చిక్కులతో ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రంలో కాంటా వేసి మిల్లుకు పంపిన ధాన్యాన్ని మిల్లర్లు దింపుకోకుండా ఇబ్బందులపాలు చేస్తున్నారు. తాలు ఉందని, తడిచిందని తదితర కొర్రీలు పెడుతూ ధాన్యం దింపుకోవడం లేదు. ధాన్యం దింపుకొని ఇవ్వాల్సిన ట్రక్ షీట్లు ఇవ్వడం లేదు. క్వింటాకు కిలో, రెండు కిలోల కోతకు ఒప్పుకుంటేనే ధాన్యం దించుకుంటామని, లేదంటే వెనక్కి పంపిస్తామని చెబుతుండటంతో గత్యంతరం లేక రైతులు సరేనంటున్నారు.

రైతులకు తప్పని నష్టం

జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో 5,36,817 మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్, కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే శుక్రవారం నాటికి 6,73,100 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇంకా కొనుగోలు కేంద్రాల్లో 30 వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు పంపించినా అనేక లారీలు అక్కడే ఆగిపోయాయి. క్వింటాకు 2, 3 కిలోల ధాన్యం కోతలకు ఒప్పుకుంటేనే ధాన్యం దింపుకుంటామని, ట్రక్ షీట్లు ఇస్తామని కొందరు మిల్లర్లు చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రైతులు నష్టపోకతప్పడం లేదు. మిల్లుల వద్ద పక్కాగా ధాన్యం దింపుకునేలా పర్యవేక్షించడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైందని రైతులు ఆరోపిస్తున్నారు. కొనుగోలు కేంద్రంలోనే అన్ని చూసి కొనుగోలు చేశారు కదా.. ఎందుకు దించుకోవడం లేదని మిల్లర్లను అడిగే ధైర్యం అధికారులకు లేకుండా పోయిందని పేర్కొంటున్నారు. అసలు మిల్లర్లపై ప్రభుత్వ యంత్రాంగం అజమాయిషీ లేకపోవడంతో మిల్లర్లు ఇష్టానుసారం మిల్లులకు వెళ్లిన ధాన్యంలో కోత విధిస్తున్నారని రైతులు అంటున్నారు.

మిల్లుల్లో ఆగిపోయిన లారీలు..

జిల్లాలో అనేక చోట్ల మిల్లుల వద్ద ధాన్యం తీసుకెళ్లిన లారీలు ఆగిపోయాయి. మిల్లుకు వచ్చిన ధాన్యంలో పలు సాకులు చెబుతూ మిల్లర్లు దింపుకోవడం లేదు. రైతులు ధాన్యంలో కోతలకు ఒప్పుకుంటేనే మిల్లర్లు ఆ ధాన్యాన్ని దింపుకొని ట్రక్ షీట్లు ఇస్తున్నారు. ఇలా శుక్రవారం నాటికి డిండి మండలంలో 315 లారీల ధాన్యం మిల్లలకు పంపితే 289 లారీలకు సంబంధించిన ట్రక్ షీట్‌లు మాత్రమే కొనుగోలు కేంద్రానికి వచ్చాయి. మిల్లుల వద్దే 26 లారీలకు సంబంధించిన ట్రక్ షీట్లు ఆగిపోయాయి. మర్రిగూడ మండంలో 129 లారీల ధాన్యం మిల్లులకు వెళితే 100 లారీల ట్రక్ షీట్లు వచ్చాయి. ఇంకా 29 లారీలు మిల్లుల వద్దే ఉండిపోయాయి. మునుగోడు మండలంలో 372 లారీలు వెళితే 357 లారీల ట్రక్ షీట్లు రాగా, 15 లారీల ట్రక్ షీట్లు అక్కడే ఉన్నాయి. గట్టుప్పల్ మండలంలో 34 లారీల ధాన్యం మిల్లులకు వెళితే 24 లారీల ట్రక్ షీట్లు మాత్రమే వచ్చాయి. ఇంకా 10 లారీలు అక్కడే ఉండిపోయియి. జిల్లాలోని ప్రతి మండలంలో ఇలాంటి దుస్థితే నెలకొంది.

నల్లగొండ కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్ : నల్లగొండ జిల్లా డీఆర్‌డీఏలో పనిచేస్తున్న వారి కనీస వేతన స్కేల్ మంజూరు చేయాలని కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. దీనిపై సమ్మతి నివేదికను తమ ముందు ఉంచాలని స్పష్టం చేసింది. ఒకవేళ తీర్పు అమలు చేయని పక్షంలో ధిక్కరణ చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించింది. గతంలో తాము ఇచ్చిన ఉత్తర్వులను కలెక్టర్ ఉద్దేశపూర్వకంగానే ఉల్లంఘించారని.. ఇది న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించడమేనని ఆగ్రహం వ్యక్తం చేసింది. 4 వారాల్లో ఆదేశాలు అమలు చేయకుంటే చర్యలు తప్పవని తేల్చిచెప్పింది. వివరాల ప్రకారం.. డీఆర్‌డీఏలో పనిచేస్తున్న తమకు వేతన పే స్కేల్ తోపాటు ఇంక్రిమెంట్ కూడా అమలు చేయాలని కోరుతూ నల్లగొండ జిల్లా డీఆర్‌డీఏ ఆఫీస్ సబార్డినేట్ యు.కలమ్మతో పాటు మరో ఇద్దరు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. 2 వారాల్లో వినతిపత్రం సమర్పించాలని పిటిషనర్లను ఆదేశించింది. అప్పటి నుంచి మరో రెండు వారాల్లో దానిపై నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్‌కు స్పష్టం చేసింది. పిటిషనర్ల వాదనలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలని.. అన్ని షరతులను నెరవేర్చినట్లయితే, అలాగే విధులు నిర్వహిస్తున్న వారితో సమానంగా పిటిషనర్లకు తగిన ఉపశమనం కల్పించాలని గతేడాది ఏప్రిల్ 2న ఆదేశాలు జారీ చేసింది. వారు రెగ్యులర్ పోస్టులో పనిచేయడం లేదు కనుక పేస్కేల్, ఇంక్రిమెంట్‌కు అర్హులు కాదని గతేడాది ఆగస్టులో నాటి కలెక్టర్ స్పీకింగ్ ఆర్డర్ విడుదల చేశారు. దీన్ని సవాల్ చేస్తూ, గతేడాది ఏప్రిల్ 2న హైకోర్టు ఇచ్చిన తీర్పును ఉద్దేశపూర్వకంగా అమలు చేయడం లేదంటూ కలమ్మతో పాటు మరో ఇద్దరు హైకోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.మాధవీదేవి ఇటీవల విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. నాలుగు వారాల్లో నివేదిక అందజేయాలని, లేకుంటే ధిక్కరణ చట్టం కింద చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కలెక్టర్‌ను హెచ్చరించింది.

హాలిడేస్‌లో జాలీగా..!

సమ్మర్‌లో నయా ట్రెండ్



- సెలవుల్లో విజ్ఞాన, విహారయాత్రలకు పయనం
- దేశ, విదేశాల్లో కుటుంబాలతో కలిసి ఎంజాయ్ చేస్తున్న జనం
- టూర్ ప్యాకేజీలతో ఆకట్టుకుంటున్న ట్రావెల్స్ ఏజెన్సీలు

వేసవికాలం వచ్చిందంటే చాలు గతంలో అందరి చూపు అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యల దగ్గరికి వెళ్లాలని.. పల్లెటూరు వాతావరణాన్ని ఆస్వాదిస్తూ పచ్చని చెట్లు, పొలం దగ్గర బావిలో ఈతలు, తాటి ముంజలు, రకరకాల ఆటలతో గడపాలని కోరుకునేవారు. కానీ కాలం మారుతోంది. హాలిడేస్‌లో కుటుంబాలతో కలిసి జాలీగా దేశ, విదేశాల్లో, చల్లని ప్రదేశాల్లో గడుపుతున్నారు. దైవదర్శనాలకు వెళ్తున్నారు. ముఖ్యంగా కేరళ, కొడైకెనాల్, ఊటీ లాంటి ప్రదేశాల్లో గడిపేందుకు ఇష్టపడుతున్నారు. ఆర్థికంగా ఉన్న వారు విదేశాలకు వెళ్తున్నారు. వారి అభిరుచికి తగ్గట్టుగానే.. ట్రావెల్స్ ఏజెన్సీలు టూర్ ప్యాకేజీలను అందిస్తున్నాయి.

- రామగిరి(నల్లగొండ), సూర్యాపేట అర్బన్

సండే స్పెషల్

వేసవి సెలవుల్లో దగ్గరలోనే చూడదగిన ప్రదేశాలకు వెళ్లేవారు. కానీ ఇప్పుడు వసతులు పెరగడంతో.. దూర ప్రాంతాల్లో గేమింగ్ జోన్స్, చారిత్ర ప్రదేశాలు, ఎంటర్‌టైన్మెంట్ జోన్స్, రిసార్ట్‌లను సందర్శిస్తున్నారు. ఆహ్లాదం పొందడానికి శీతల ప్రాంతాలు, బీచ్‌లు, ఐలాండ్‌లతో పాటు ఆధ్యాత్మిక ప్రాంతాలకు సైతం వెళ్తున్నారు. ముఖ్యంగా సెలవులు రావడంతో, ఫ్యామిలీ, స్నేహితులంతా జాలీ జాలీగా ఎంజాయ్ చేయడానికి ఎక్కువ ఆసక్తి చేపిస్తున్నారు. పిల్లలకు రకరకాల ప్రదేశాలను చూపిస్తున్నారు. సమ్మర్‌లో సరదాగా గడిపేందుకు సుదూరంగా ఉన్న పర్యాటక ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. విజ్ఞాన, విహార యాత్రలకు పయనమవుతున్నారు. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు చల్లని ప్రదేశాలను ఎంచుకుంటున్నారు. కుటుంబాలతో కలిసి ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శిస్తున్నారు.



మనదగ్గరే ట్రావెల్స్ ఏజెన్సీలు


ప్రజలు ఎంచుకున్న ప్రదేశాన్ని బట్టి ట్రావెల్స్ ఏజెన్సీలు ప్యాకేజీలు అందిస్తున్నాయి. ఒకప్పుడు హైదరాబాద్‌కు పరిమితమైన ఈ సంస్థలు ఉమ్మడి జిల్లాలోనూ ఏర్పాటయ్యాయి. ఈ ఏజెన్సీలు సమయం, వెళ్లే ప్రదేశాన్ని బట్టి ప్రయాణానికి ఫ్లైట్, ట్రెన్ లేదా ప్రత్యేక వాహనాలను, ఉండడానికి హోటల్స్‌ను కూడా సమకూరుస్తాయి. యాత్రకు వెళ్లే టూరిస్టుల సంఖ్య ఎక్కువగా ఉంటే.. గైడ్‌ని కూడా ఏర్పాటు చేస్తున్నాయి. ఏదైనా ప్రదేశానికి వెళ్లాలనుకునే కుటుంబ సభ్యులు, స్నేహితులు, స్టూడెంట్స్, కంపెనీల వారు టూరిస్టు సంస్థలను సంప్రదిస్తున్నారు. వెళ్లే చోట సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలంటే ఇబ్బందులు తలెత్తడంతో పాటు సమయం కూడా వృథా అయ్యే అవకాశం ఉండడంతో.. ట్రావెల్స్ సంస్థల ద్వారానే వెళ్తున్నారు.

దేశ విదేశాలకు ప్యాకేజీలు...



ప్రయాణాలు అంటే.. అనుభవాలను సేకరించే జీవనయానం. ఇప్పటివరకు ట్రావెల్స్ సేవల కోసం నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు నల్లగొండలో పర్యాటకుల కోసం ఎట్రియా ట్రావెల్ స్టూడియో ప్రైవేట్ లిమిటెడ్ స్థాపించాం. మా సంస్థ ద్వారా దేశీయ, అంతర్జాతీయ, కస్టమైజ్డ్ ప్యాకేజీలను అందిస్తున్నాం. ప్రయాణ టికెట్లు, వీసాతో పాటు, హోటల్ బుకింగ్ కూడా చేస్తాం.

-ఎం.గోపినాథ్‌రెడ్డి, ట్రావెల్స్ ఏజెన్సీ, నల్లగొండ



సంతోషంగా గడిపాం

మేము మూడు ఉమ్మడి కుటుంబాల నుంచి సుమారు పదిమందిమి కలిసి షిరిడి, నాసిక్, శనిసింగనాపూర్ వెళ్లాం. షిరిడీ ట్రిప్ చాలా సంతోషాన్నిచ్చింది. వేసవి సెలవుల్లో కుటుంబ సభ్యులతో కలిసి షిరిడి వెళ్లడం చాలా సంతోషం అనిపించింది. అందరం ఆనందంగా గడిపాం. ఈ వేసవి వినోదం మాకు చాలా ప్రత్యేకమైనది జీవితంలో మర్చిపోలేనిది.

– గునగంటి రమేష్, సూర్యాపేట

గోవా వెళ్లేందుకు సిద్ధమయ్యాం

ఈ వేసవిలో పిల్లలకు సెలవులు రావడంతో ఓ నాలుగు కుటుంబాల సభ్యులం అందరం కలిసి వేసవికి గోవా వెళ్లడానికి ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నాం. ప్రయాణానికి కావాల్సిన వస్తువులు, రూట్ మ్యాప్ సిద్ధం చేసుకున్నాం. త్వరలో గోవా వెళ్లి వస్తాం. పిల్లలకు సెలవులు రావడంతో ఈ వేసవి వారికి గుర్తుండేలా గోవాతో పాటుగా మరికొన్ని ప్రదేశాలను చూపిస్తాం.

– మంకెన మధు, సూర్యాపేట

ఈసారి గిరాకీ బాగుంది



వేసవి విడిది ప్రదేశాలైన ఊటీ, కొడైకెనాల్, చెన్నై, వైజాగ్, పాండిచ్చేరితో పాటు భారతదేశంలో ప్రముఖమైన పుణ్యక్షేత్రాలకు లగ్జరీ వాహనాలను నడిపిస్తున్నాం. కానీ ఈ సంవత్సరం వేసవి సెలవులు ప్రారంభం కాగానే మాకు.. వేసవి విడిది ప్రాంతాలకు, పుణ్యక్షేత్రాలకు దగ్గరగా ఉన్న చూడదగిన ప్రదేశాలకు గిరాకీ బాగుంది. ఈ ట్రిప్పుల వల్ల మాకు ఉపాధి పెరగడమే కాకుండా కొత్త డ్రైవర్లకు కూడా ఉపాధి లభించింది. ఈ వేసవి ఆర్థికంగా మాకు చాలా సంతోషాన్ని ఇచ్చింది.

– మరిపెల్లి అశోక్, టూర్స్ అండ్ ట్రావెల్స్, సూర్యాపేట



శని సింగనాపూర్‌లో సూర్యాపేట మహిళలు

పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పరిశీలన



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కట్టంగూర్ : తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరు ఇచ్చేలా ప్రాధాన్యతా క్రమంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామంలో రూ.101 కోట్లతో నిర్మించనున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులను శనివారం రాత్రి ఆయన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడెం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలోనే పాలమూరు, రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, ఎస్‌ఎల్‌బీసీ, డిండి తదితర ప్రాజెక్ట్‌లన్నీ పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కూలిపోయిన ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులు పునఃప్రారంభించి తమ హయంలోనే పూర్తి చేస్తామన్నారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగం వెళ్తున్న 44 కిలోమీటర్ల భూమిని ఎలక్ట్రో మాగ్నటిక్ సర్వే చేయించేందుకు డెన్మార్క్ నుంచి హెలికాప్టర్ తెప్పించామన్నారు. అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. డిస్ట్రిబ్యూటరీ, కెనాల్స్ విషయంపై రైతులతో చర్చించాలని ఎమ్మెల్యే వేముల వీరేశంకు సూచించారు. భూ సేకరణ సాధ్యం కాకపోతే పైపులైన్ ద్వారా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వానాకాలంలో 153 లక్షల మెట్రిక్ టన్నులు, యాసంగిలో 130 లక్షల మెట్రిక్ టన్నులు మొత్తం 281 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించి భారత దేశంలోనే తెలంగాణ రాష్ట్రం చరిత్ర సృష్టించిందన్నారు.

ఆసిఫ్‌నహర్ కాలువ లింకు చేయాలి

అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ఆసిఫ్‌నహర్ కాల్వను లింక్ చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం మంత్రిని కోరారు. డిసెంబర్ చివరి నాటికి అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేస్తే 8,000 వేల ఎకరాలను సాగునీరు అందుతుందన్నారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం మేరకు లిఫ్ట్ ఇరిగేషన్‌లు, ప్రాజెక్ట్‌లను పూర్తి చేస్తుందన్నారు. నల్లగొండ జిల్లా ప్రాజెక్ట్‌ల చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు సహకరిస్తే డిసెంబర్‌లోపే ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామని తెలిపారు. అంతకు ముందు మంత్రి లిఫ్ట్ ఇరిగేషన్ స్థలాన్ని మంత్రి పరిశీలించి, ఇరిగేషన్ శాఖ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఉదయ సముద్రం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ వివరాలను మంత్రికి తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ వై.అశోక్‌రెడ్డి, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, ఈఈ అజయ్‌కుమార్, ఏఈ రాజశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు సంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, వెంకట్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

తెలుగు భాషపై వివక్షను విడనాడాలి

నల్లగొండ టూటౌన్ : యూజీసీ నిబంధనల పేరుతో ఉన్నత విద్యామండలి డిగ్రీ స్థాయిలో తెలుగు భాషపై వివక్షను విడనాడాలని ఎంజీయూ తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ కే.అరుణ ప్రియ అన్నారు. నల్లగొండ సమీపంలోని ఎంజీయూనివర్సిటీలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వివిధ డిగ్రీ కాలేజీల తెలుగు అధ్యాపకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. డిగ్రీ విద్యార్థులకు తెలుగు 20 క్రెడిట్ ఉండగా యూజీసీ నిబంధనల పేరుతో 12 క్రెడిట్లకు తగ్గించడం సరికాదన్నారు. దీనివల్ల విద్యార్థులు పీజీలో అడ్మిషన్ పొందడానికి అర్హత కోల్పోతారన్నారు. ఉన్నత విద్యామండలి తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే తెలుగు భాష ఉపాధ్యాయులు ఉద్యమబాట పట్టాల్సి వస్తుందని తెలిపారు. తెలుగు అధ్యాపకులు చేసిన తీర్మానాలను వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌కు అందజేశారు. సమావేశంలో ఆర్ట్స్ కళాశాల డీన్ ప్రొఫెసర్ అంజిరెడ్డి, కృష్ణకౌండిన్య, ఎం.ఆనంద్ పాల్గొన్నారు.



వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలుగు అధ్యాపకులు

ప్రజా సమస్యలపై ఉద్యమిస్తాం : జూలకంటి

మిర్యాలగూడ : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కోసం బలమైన ఉద్యమాలు చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మిర్యాలగూడలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, గృహలక్ష్మి కింద మహిళలకు ఆర్థిక సాయం, గ్యాస్‌పై రూ.500 సబ్సిడీ అందరికీ వెంటనే అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు తండ్రి, కూతుళ్ల లేఖ హాట్ టాపిక్‌గా మారిందని వారి మధ్యలో ఉన్న సమస్య ప్రజలకు అవసరం లేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, నూకల జగదీశ్చంద్ర, సత్యనారాయణరావు, తిరుపతి రామ్మూర్తి, దేశీరాం నాయక్, కోడిరెక్క మల్లయ్య, అరుణ, పాపిరెడ్డి, గోవర్ధిని, కరీమున్నిసాబేగం పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఉమ్మడి జిల్లా చెస్ సెలక్షన్స్

సూర్యాపేట: సూర్యాపేటలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10గంటల నుంచి ఉమ్మడి జిల్లా అండర్–11, 17 బాల బాలికల చెస్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి గండూరి కృపాకర్, ఎల్. సతీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన వారిని హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. వివరాలకు 9394753343 నంబర్ సంప్రదించాలన్నారు.

మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

మిర్యాలగూడ టౌన్: నల్లగొండ రైల్వే ఎస్పీ ఆదేశాల మేరకు మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి నార్కోటిక్ డాగ్స్‌తో మిర్యాలగూడ రూరల్ పోలీసుల సహకారంతో రైల్వే పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్‌లోని పలు స్టాళ్లను పరిశీలించారు. ఈ తనిఖీల్లో మిర్యాలగూడ రూరల్ ఏఎస్‌ఐ ఉమాపతిరావు, రైల్వే పోలీసులు పాల్గొన్నారు.

కుమారుడిని సర్కారు బడిలో చేర్పించిన ప్రభుత్వ టీచర్



తిరుమలగిరి ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్ తీసుకుంటున్న ప్రశాంతి

తిరుమలగిరి: తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉపాధ్యాయురాలు దొంగరి ప్రశాంతి తన కుమారుడు రిషికి తిరుమలగిరిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం అడ్మిషన్ తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నాయని, తన కుమారుడికి నాణ్యమైన విద్య అందుతుందనే నమ్మకంతో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట భర్త హరీష్, మండల విద్యాధికారి శాంతయ్, ప్రధానోపాధ్యాయులు అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు కవిత, సత్యనారాయణరెడ్డి, వెంకట్రామనర్సయ్య, సోమ్యబాయి, గిరి, వెంకటయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి



నరసింహ (ఫైల్)

చింతపల్లి: నిచ్చెన పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. చింతపల్లి మండలం ఉమాంతలపల్లి గ్రామానికి చెందిన అరేకంటి నర్సింహ (59) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇంట్లో కరెంట్ రాకపోవడంతో గురువారం నిచ్చెన సహాయంతో ఇంటి పైకి ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు.

విదేశాలకు డ్రై వెజిటబుల్స్

- ఆరబెట్టిన కూరగాయలను గల్ఫ్, యూరప్ దేశాలకు ఎగుమతి చేస్తున్న ఔత్సాహిక రైతు మురళీరాజ్
- నాగినేనిపల్లిలో 16 ఎకరాల్లో సోలార్ డ్రైయర్ యూనిట్‌ల ఏర్పాటు
- ఆసక్తి గల రైతులకు సోలార్ డ్రైయర్ యూనిట్‌లు అందజేసి ప్రోత్సాహం



సోలార్ డ్రైయర్‌లో ఆరబెట్టిన వెజిటబుల్స్



తన వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన సోలార్ డ్రైయర్‌లను చూపుతున్న మురళీరాజ్

బొమ్మలరామారం: హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మురళీరాజ్ డ్రై వెజిటబుల్స్(ఆరబెట్టిన కూరగాయలు)ను విదేశాలకు ఎగుమతి చేస్తూ మంచి లాభాలు గడిస్తున్నారు. అంతేకాకుండా సోలార్ డ్రైయర్ యూనిట్‌లను స్వయంగా తయారుచేస్తూ డ్రై వెజిటబుల్ వ్యాపారం చేసేందుకు ఆసక్తి గల రైతులకు విక్రయిస్తూ వారిని కూడా ప్రోత్సహిస్తున్నారు. బొమ్మలరామారం మండలంలోని నాగినేనిపల్లి గ్రామ శివారులో 16ఎకరాల భూమిని మురళీరాజ్ కౌలుకు తీసుకొని సోలార్ డ్రైయర్ వెజిటబుల్ యూనిట్‌లను ఏర్పాటు చేశారు. తన వ్యవసాయ క్షేత్రంలో పండిస్తున్న పలు రకాల కూరగాయలతో పాటు మార్కెట్‌లో లభించే పండ్లను సైతం సోలార్ వెజిటబుల్ డ్రైయర్ యూనిట్‌లో ఆరబెట్టి స్థానిక మార్కెట్‌లో విక్రయించడంతో పాటు విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగారు. అంతేకాకుండా తాను సోలార్ డ్రైయర్‌లు విక్రయించిన రైతుల వద్ద ఆరబెట్టిన కూరగాయలను కూడా సేకరించి యూరప్‌లోని జర్మనీ, నార్వే, స్పెయిన్, రష్యా దేశాలతో పాటు గల్ఫ్ దేశాలైన టర్కీ, కువైట్, ఒమన్, సౌదీలకు ఎగుమతి చేస్తున్నారు. అదేవిధంగా పర్వతారోహణ చేసే వారి కోసం హిమాలయాల వరకు సైతం ఈ డ్రై వెజిటబుల్ వ్యాపారం విస్తరించింది. ప్రధానంగా అల్లంవెల్లుల్లి, మునగాకు, మునగకాయలు, ఉసిరి, అరటి, టమాట, ద్రాక్ష పండ్లను ఎగుమతి చేస్తున్నారు.

బహుళ ప్రయోజనకారిగా యూనిట్‌లు

కూరగాయలు సాగుచేస్తున్న రైతులకు సోలార్ డ్రైయర్ యూనిట్‌లు లాభసాటిగా మారాయి. ఎక్కువ విస్తీర్ణంలో కూరగాయలు సాగు చేసి, మార్కెట్‌లో డిమాండ్ తక్కువగా ఉండడంతో రైతులకు ధర గిట్టుబాటు కాక అప్పులపాలైన సంఘటన చాలా ఉన్నాయి. ప్రకృతి వైపరీత్యాలు, తక్కువ విస్తీర్ణంలో సాగు లాంటి కారణాలతో కొన్ని సమయాల్లో కూరగాయల ధరలు ఆకాశానంటుతున్నాయి. ఇలాంటి సమయాల్లో సోలార్ డ్రైయర్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకుని ఆ యూనిట్‌లో కూరగాయలు, పండ్లను ఆరబెట్టి భద్రపరచడంతో ఆరు నెలల వరకు ఈ డ్రై వెజిటబుల్స్‌ను వాడుకోవచ్చు. ఇలా చేయడం వలన రైతులు నష్టాల బారిన పడకుండా, వినియోగదారులకు అధిక ధరల సెగ తగలకుండా ఉంటుంది.

పోషకాల లోపం ఉండదు

వెజిటబుల్స్‌ను 40–50 డిగ్రీల మధ్యనే ఆరబెట్టడంతో పోషకాల లోపం ఉండదని మురళీరాజ్ పేర్కొంటున్నారు. క్యాటరింగ్ చేసే వ్యక్తులు, హోటల్స్ నిర్వాహకులు, ఎన్‌ఆర్‌ఐలకు ఈ డ్రై వెజిటబుల్స్ ఉపయోగకరంగా ఉంటున్నాయి. కూరగాయలతో పాటు పండ్లు, అన్నిరకాల మాంసహార ఉత్పత్తులను సైతం సోలార్ డ్రైయర్‌లో ఆరబెట్టి నిల్వ చేసుకోవచ్చు.

ప్రభుత్వం చేయూతనివ్వాలి

సోలార్ వెజిటబుల్ డ్రైయర్ యూనిట్ ఏర్పాటు చేసుకోవడానికి కెపాసిటీని బట్టి రూ.75వేల నుంచి రూ.2లక్షలకు పైగా ఖర్చవుతుంది. ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడంతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే చాలా మంది కూరగాయల రైతులకు మేలు జరుగుతుంది. కూరగాయల సాగు చేస్తున్న రైతుల్లో డ్రై వెజిటబుల్స్ యూనిట్‌లు ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి పెరిగింది. ఇప్పటివరకు 40 మంది రైతులు తన నుంచి సోలార్ డ్రైయర్‌లను కొనుగోలు చేసినట్లు మురళీరాజ్ పేర్కొన్నారు. చాలామంది రైతులు తన వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన సోలార్ డ్రైయర్ వెజిటబుల్ యూనిట్‌లను సందర్శించి, తమకు కూడా యూనిట్‌లను తయారు చేసి ఇవ్వాలని కోరుతున్నారని ఆయన తెలిపారు.

డిమాండ్ అధికంగా ఉంది



రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నాను. సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలు సాగు చేస్తున్న రైతులు సోలార్ డ్రైయర్‌లో ఆరబెట్టిన కూరగాయలను సేకరించి విదేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నాం. గల్ఫ్, యూరప్ దేశాల్లో డ్రై వెజిటేబుల్స్‌కు మంచి డిమాండ్ ఉంది. పర్వతారోహకులు ఎక్కువ బరువు గల కూరగాయలను తమతో తీసుకెళ్లేందుకు ఇబ్బందిగా ఉంటుంది. వారి సౌలభ్యం కోసం డ్రై వెజిటేబుల్స్ అందిస్తున్నాం.

– మురళీరాజ్, నాగినేనిపల్లి

అప్పులు చేసి పరారైన వ్యాపారి

- డబ్బులు ఇచ్చి మోసపోయిన మహిళ ఆత్మహత్యాయత్నం
- ఒక్కొక్కరుగా బయటకు వస్తున్న బాధితులు



చికిత్స పొందుతున్న మహిళ



న్యాయం చేయాలని కోరుతున్న బాధిత మహిళలు

భువనగిరి టౌన్: డ్రై ఫ్రూట్స్ వ్యాపారం చేసే వ్యక్తి తన వద్ద పనిచేసే మహిళల నుంచి అప్పులు తీసుకుని వాటిని తీర్చలేక పరారయ్యాడు. దీంతో అతడికి అప్పు ఇచ్చిన ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేయగా.. పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటన శనివారం భువనగిరిలో వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అనిగిరి రాధాకృష్ణ, అతడి కుమారుడు అవినాష్ భువనగిరిలోని గంజ్ మార్కెట్ వెనుక రుద్ర డ్రై ఫ్రూట్స్ పేరిట వ్యాపారం చేస్తున్నారు. డ్రై ఫ్రూట్స్, మసాలాలు ప్యాకింగ్ చేసేందుకు వారి వద్ద ఏడుగురు మహిళలు పనిచేస్తున్నారు. వ్యాపారం అభివృద్ధి చేస్తానని చెప్పి అధిక వడ్డీ ఆశ చూపి వారి వద్ద పనిచేసే మహిళలకు ఒకరికి తెలియకుడా మరొకరి నుంచి రూ.30 లక్షలకు పైగా అప్పులు తీసుకున్నారు. వారి వద్ద పనిచేసే భువనగిరి పట్టణంలోని అర్బన్‌కాలనీకి చెందిన తోట సరిత రూ.2.40 లక్షలు అప్పుగా ఇచ్చింది. అంతేకాకుండా మరో రూ.లక్ష ఇతరుల నుంచి అప్పుగా ఇప్పించింది. అయితే తీసుకున్న డబ్బులను రాధాకృష్ణ, అతడి కుమారుడు అవినాష్ తిరిగి ఇవ్వకపోగా.. మూడు రోజుల నుంచి వారు ఇంట్లో లేకపోవడంతో పాటు ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటంతో ఆందోళనకు గురైన సరిత శనివారం ఇంట్లో బాత్రూంలు కడిగే హార్పిక్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఆమెను భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లారు. అదేవిధంగా ఇటీవలే విడాకులు తీసుకున్న మరో మహిళ పుస్తెలతాడు అమ్మి అప్పు ఇవ్వగా.. మరికొందరు చిట్టీలు ఎత్తి, బజాజ్ ఫైనాన్స్ కార్డుల ద్వారా డబ్బులు తీసి అప్పులు ఇచ్చినట్లు తెలిసింది. మూడు రోజుల క్రితం రాధాకృష్ణ కుటుంబం పరారైందని బాధితులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్ తెలిపారు.

మగబిడ్డకు జన్మనిచ్చి బాలింత మృతి

- హార్ట్ స్ట్రోక్‌తో మృతిచెందిందని చెబుతున్న ఆస్పత్రి వర్గాలు
- వైద్యుల నిర్లక్ష్యంతోనే ప్రాణాలు కోల్పోయిందని బంధువుల ఆందోళన

కోదాడ: ప్రసవం కోసం కోదాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు వచ్చిన గర్భిణి మగబిడ్డకు జన్మనిచ్చి మృతి చెందింది. ప్రసవం అనంతరం పల్స్ పడిపోవడంతో హార్ట్ స్ట్రోక్ వచ్చిందని, ఆమెను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ లాభం లేకుండా పోయిందని ఆస్పత్రి వర్గాలు చెబుతుండగా, వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలింత మృతి చెందిందని బంధువులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వివరాలు.. కోదాడకు చెందిన రాయపూడి వెంకటనారాయణ కుమార్తె హిమబిందు(30)ను నల్లగొండకు చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. హిమబిందు మొదటి కాన్పు కోదాడలోని తిరుమల ఆస్పత్రిలో జరగడంతో.. ఇప్పుడు రెండో కాన్పు కోసం కూడా ఆమెను తిరుమల ఆస్పత్రిలో రెండు రోజుల క్రితం చేర్పించారు. శనివారం నార్మల్ డెలివరీ అవుతుందని వైద్యులు చెప్పారు. రాత్రి ఆమె నార్మల్ డెలివరీ కావడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం కొద్దిసేపటికే హిమబిందు మృతిచెంది. ప్రసవం చేసే సమయంలో హిమబిందుకు గాయమై రక్తస్రావం అవుతుండడంతో కుట్లు వేసేందుకు ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లి కుట్లు వేశామని, ఇదే సమయంలో పల్స్ పడిపోయిందని, పల్స్ రప్పించడానికి సీపీఆర్‌తో పాటు అన్నిరకాల ప్రయత్నాలు చేసినా లాభం లేకుండా పోయిందని వైద్యులు చెబుతున్నారు. కాగా వైద్యుల నిర్లక్ష్యం వల్లే హిమబిందు చనిపోయిందని ఆమె తరఫు బంధువులు ఆరోపిస్తున్నారు. తమకు ఆస్పత్రికి సంబంధించిన పూర్తి సీసీ టీవీ ఫుటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమయంలో కొందరు ఆవేశంతో ఆస్పత్రి అద్దాలను పగులగొట్టారు. సమాచారం తెలుసుకున్న కోదాడ పట్టణ సీఐ శివశంకర్ తన సిబ్బందితో ఆస్పత్రికి వద్దకు చేరుకుని వారికి నచ్చజెప్పి కుటుంబ సభ్యులు మినహా ఇతరులను ఆస్పత్రి నుంచి పంపించేశారు.

మహిళా కండక్టర్‌ను దూషించిన ప్రయాణికుడిపై కేసు

భువనగిరిటౌన్: మహిళా కండక్టర్‌తో దురుసుగా ప్రవర్తించిన ప్రయాణికుడిపై శనివారం భువనగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం బొల్లెపల్లికి చెందిన కొత్తపల్లి భానుప్రకాష్ శనివారం హైదరాబాద్‌లోని ఉప్పల్ ఎక్స్‌రోడ్డులో జనగామ డిపోకు చెందిన బస్సు ఎక్కి స్వగ్రామానికి బయల్దేరాడు. అప్పటికే బస్సు ప్రయాణికులతో కిక్కిరిసి ఉండగా.. తన కాలుకు ఆపరేషన్ అయ్యిందని, ఇతరులను ఖాళీ చేయించి తనకు సీటు ఇప్పించాలని అతడు మహిళా కండక్టర్‌ను కోరారు. కండక్టర్ పట్టించుకోకపోవడంతో ఆమెతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో భాను ప్రకాష్ మహిళా కండక్టర్‌ను అసభ్యంగా దూషించాడు. దీంతో బస్సును భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఆపి మహిళా కండక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భానుప్రకాష్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

శుభకార్యానికి వెళ్తూ మృత్యువాత

- గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం

యాచారం: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. రంగారెడ్డి జిల్లా యాచారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరగగా.. మృతుల్లో ఒకరు నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం దంజాలాల్‌తండా వాసిగా పోలీసులు గుర్తించారు. యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం పల్లెచల్కతండాకు చెందిన విస్లావత్ అశోక్(22), నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం దంజాలాల్‌తండాకు చెందిన రమావత్ అరుణ్(24) బావబామ్మర్దులు. పల్లెచల్కతండాలో ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు శుక్రవారం అర్ధరాత్రి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై హైదరాబాద్ నుంచి వారిద్దరు బయల్దేరారు. యాచారం ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద గుర్తుతెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అరుణ్ అక్కడికక్కడే మృతిచెందగా.. అశోక్‌ను 108 వాహనంలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారును ఢీకొట్టిన డీసీఎం.. నలుగురికి గాయాలు



కారుపై బోల్తా పడిన డీసీఎం

నకిరేకల్: ముందు వెళ్తున్న కారును డీసీఎం ఢీకొనడంతో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున నకిరేకల్ పట్టణ శివారులో జరిగింది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు డ్రైవర్ నకిరేకల్ పట్టణ శివారులో విజయవాడ–హైదరాబాద్ హైవే బైపాస్ పైకి రాగానే సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న డీసీఎం ఢీకొట్టింది. దీంతో కారు రోడ్డు పక్కన డివైడర్‌ను ఢీకొని ఆగిపోయింది. డీసీఎం అదుపుతప్పి అదే కారుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి, డీసీఎంలో ఉన్న ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో వాహనాలను రోడ్డు పక్కకు తొలగించారు. గాయపడిన వారిని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు. క్షతగాత్రులంతా హైదరాబాద్‌కు చెందినవారని పేర్కొన్నారు.

గేదెను ఢీకొని యువకుడి మృతి



సాయి (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: బైక్‌పై ఇంటికి వెళ్తున్న యువకుడు గేదెను ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన శనివారం సాయంత్రం పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సీతావానిగూడెంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతావానిగూడెం గ్రామానికి చెందిన ఒంటిద్దు సాయి(24) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ముక్తాపూర్ నుంచి తప్పించుకొని సీతావానిగూడెం వైపు వచ్చిన గేదె పరిగెడుతూ రోడ్డుపై అకస్మాత్తుగా అడ్డంగా రావడంతో గేదెను తప్పించబోయి దానిని ఢీకొట్టి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో సాయి తలకు తీవ్ర గాయాలు కాగా వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే సాయి మృతిచెందినట్లు తెలిపారు. సాయి ఏడాదిన్నర క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి 9 నెలల బాబు ఉన్నాడు.

యాదగిరి క్షేత్రంలో భక్తుల సందడి



ఆలయ ఉత్తర మాడ వీధిలో భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. వేసవి సెలవులు కావడంతో శ్రీస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, మాడ వీధుల్లో సందడి వాతావరణం కనిపించింది. కాగా శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి 3గంటలు, వీఐపీ దర్శనానికి గంటకు పైగా సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. శ్రీస్వామి వారి ప్రసాద విక్రయశాల, మాడ వీధులు, క్యూలైన్లు, బస్టాండ్ ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. శ్రీస్వామివారిని 40వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.49,77,624 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

స్కూటీకి నిప్పంటించిన దుండగులు



కాలిపోయిన స్కూటీ

రామన్నపేట: ఇంటి ముందు పార్కింగ్ చేసిన స్కూటీపై గుర్తుతెలియని దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి రామన్నపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండల కేంద్రానికి చెందిన బాలగోని వెంకట హరిదీప్ తన స్కూటీని శుక్రవారం రాత్రి తన ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి 11గంటల సమయంలో గుర్తుతెలియని దుండగులు బాటిల్‌లో పెట్రోల్ తీసుకొచ్చి స్కూటీపై చల్లి నిప్పంటించారు. చుట్టుపక్కల వారు గమనించి నీళ్లు చల్లి మంటలు ఆర్పివేశారు. స్కూటీ ముందుభాగం పూర్తిగా కాలిపోయింది. బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వానాకాలం సాగుకు ముందస్తు ప్రణాళిక



బాబుసాయిపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

పాడిపంట

త్రిపురారం : వానాకాలం సీజన్‌లో వివిధ రకాల పంటల సాగుకు రైతులు ముందస్తుగా ప్రణాళిక ప్రకారం వేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన గ్రామాల్లో సైతం రైతు ముంగిటకు శాస్త్రవేత్తలు కార్యక్రమానికి శ్రీకారం చుట్టి రైతులకు ఖరీఫ్ సీజన్‌లో పాటించాల్సిన పద్ధతులపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

దుక్కులు దున్నడం అత్యంత కీలకం

దుక్కులు దున్నడం వల్ల తొలకరి వర్షాలకు భూమి నీటిని పీల్చుకొని పొలంలో తేమ శాతం పెగడానికి ఉపయోడపడుతుంది. వాలుకు అడ్డంగా లోతు దుక్కులు దున్నడంతో వర్షపు నీరు వృథా కాకుండా నేల కోతకు గురి కాకుండా ఉంటుంది. తోటల్లో దుక్కుల వల్ల మొండి జాతి కలుపు మొక్కలు, దుంపలు వేళ్లతో సహా బయటకు వచ్చి పిచ్చి మొక్కల కలుపు నివారణ జరుగుతుంది. నిద్రావస్థలో ఉన్న పలు కీటకాలు నశిస్తాయి. సేంద్రియ ఎరువులైన పశువుల పేడ, వర్మి కంపోస్ట్‌ను దుక్కుల్లో వేసుకోవచ్చు.

చౌడు నేలలను బాగు చేసుకోవడం

భూగర్భ జలాలను విరివిగా వాడడం వల్ల నీటిలోని క్లోరైడ్‌తో పొలాలు చౌడు భూములుగా మారుతున్నాయి. భౌసార పరీక్షలను అనుసరించి చౌడు భూములను వ్యవసాయ యోగ్య భూములుగా మార్చేందుకు వేసవి కాలం అనువైన సమయం. ఎండాకాలంలో నేలపైకి పొంగి ఉన్న ఉప్పు, చౌడు పొరలను తొలగించాలి. నీరు బయటకు వెళ్లే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలి. పొలాన్ని చదును చేసి సుమారు 20 నుంచి 25 సెంట్లుగా మడులను విభజించి గట్టు వేయాలి. కారు చౌడు నేలలను ఎండినప్పుడు పలక రాయి వలే గట్టిగా ఏర్పడతాయి. తగినంత నీరు తేమ ఉన్నప్పుడు మొత్తగా ,ఇక్కటి బురద తయారవుతుంది. ఇలాంటి నేలను బాగు చేసుకోవడానికి ఇదే మంచి సమయం.

పొలం గట్లు, పంట కాలువల తయారీ

రైతులు పొలం గట్ల తయారీ, పంట కాలువలపై అత్యంత శ్రద్ధ వహించాలి. వివిద రకాల కలుపు మొక్కలు పొలం గట్ల నుంచి పంటలకు వచ్చి పంటలకు నష్టాన్ని కలిగిస్తాయి. కలుపు మొక్కలైన ఒయ్యారి భామ, మూల మాతంగి, నీరు గోబ్బి, గొగలగరాకు, గొంగలి రాకాశి, తుంగ వంటి మొక్కలు పంటలలో పెరిగి పలు రకాలపై చేడు పరుగులు వ్యాప్తి చెంది చీడపీడల వ్యాప్తికి కారణయావుతాయి. అందువల్ల ముందస్తుగానే పొలం గట్లు, పంట కాలువను శుభ్రం చేసుకొని తయారు చేసుకోవాలి.

విత్తనాల ఎంపిక

రైతులు తమ విత్తనాలను తమ పొలం నుంచి సిద్ధం చేసుకోవచ్చు. తాలు గింజలు, సగం నిండని గింజలు, కలుపు విత్తనాలను వేరు చేసి నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలి. వరి పరిశోధన స్థానాల నుంచి సేకరించిన విత్తనాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. సర్టిఫైడ్ విత్తనాలను ఎంపిక చేసుకోవచ్చు. ఎంపిక చేసిన విత్తనాలను మొలక శాతం పరిశీలించుకొని నారు పోసుకోవాలి. ఎంపిక చేసుకున్న విత్తనాలకు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలి.

పచ్చిరొట్ట పైర్ల సాగు

పంట సాగుకు ముందస్తుగా పచ్చిరొట్ట పైర్లను సాగు చేసుకొని కలియదున్నడం వల్ల నేలలో భూసారం పెంపొందుతుంది. తొలకరి వారాలకు జనుము, జీలుగ, పిల్లిపెసర అలసంద వంటి పలు రకాల పచ్చిరొట్ట పైర్లను సాగు చేసుకొని కలియదున్నుకోవచ్చు. దీంతో ఎకరాకు 20 నుంచి 30 కిలోల యూరియాను ఆదా చేసుకోవచ్చు. పిల్లి పెసర, జనుమును పశువుల మేతగా కూడా వినియోగంచుకోవచ్చు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

రైతులకు ముందస్తు వ్యవసాయ ప్రణాళిక చాలా అవసరం. పెట్టుబడి ఖర్చులు తగ్గించుకున్నప్పుడే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది. అవసరం లేకున్నా రసాయనిక ఎరువుల వాడడం వల్ల భూసారం దెబ్బతిని దిగుబడులు తగ్గుతాయి. విత్తనాలను శాస్త్రవేత్తల సలహాలు సూచనల ఆధారంగా ఎంపిక చేసుకోవాలి. భూగర్భ జలాలను కాపాడుకోవడానికి నీటిని పొదుపుగా వాడుకోవాలి. మెట్ట వరి పైరును సైతం సాగు చేసుకోవచ్చు.

– డాక్టర్ శ్రీనివాసరావు, కేవీకే కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్

భూసార పరీక్షలు

భూమిలో పోషక విలువలు తగ్గిపోయి పంటల్లో సూక్ష్మపోషక లోపాలు కనిపిస్తుంటాయి. పోషకాలను బట్టి పంటలకు అందించే శక్తి, గాలి, నీరు భూమిలోకి చొచ్చుకుని వెళ్లి ఉదజని సూచిక, లవణ పరిమాణం, లభ్య పోషకాలు పంటల దిగుబడిపై ప్రభావ చూపుతాయి. అందువల్ల భూసార పరీక్షలు చేయించుకోవాలి. ఏడాదికి ఒక్కటి, రెండు పంటలు పండించే భూముల్లోని మట్టిని సేకరించి భూసార పరీక్ష కేంద్రాల్లో అందజేయాలి. వారి సూచనల మేరకు పంటల సాగు చేపట్టి ఎరువుల వాడకం చేపట్టడం ఉత్తమం.